# సమాంతర రేఖలు

**-డి. కామేశ్వరి**

'హాయ్' అంది ఫోనులో గొంతు - ఎన్నేళ్లయినా ఆ గొంతు గుర్తే నాకు.

'పావనీ' గొంతు పెగుల్చుకుని ఆ ఒక్కమాట అనగలిగాను.

'ఫరవాలేదే గుర్తు పట్టేరే, పేరు అడ్రస్సు చెప్పుకోవాలేమో అనుకున్నాను–' అవతల్నించి నవ్వు.

"ఎక్కడనించి, ఇండియా ఎప్పుడొచ్చావు - ఎక్కడున్నావు... యీవురొచ్చావా' ఉద్వేగం గొంతుని నొక్కేస్తుంటే పెగుల్చుకుని అన్నాను.

'అదంతా తర్వాత... ముందు మీ అడ్రసు చెప్పు... అక్కడికెలా రావాలో ఈ డ్రైవరుకి చెప్పు... ఓ గంటలో వస్తా... కల్సి భోంచేద్దాం... భోంచేస్తూ కబుర్లు చెప్పుకుందాం. వండే ఓపిక లేకపోతే హోటలు కెడదాం... వద్దు, వద్దు. అన్నట్టు శ్రావణి మాట మర్చిపోయాను. అది హోటల్లో మనల్ని కూచోనీయదు. యిల్లే బెటరు - కందిపొడి, ఆవకాయ, చారు, పెరుగుచాలు. ఏం వండకు అంటూ చెప్పేసి ఫోను డ్రైవరుకి యిచ్చింది. ఎలా రావాలో గుర్తులు చెప్పి వంటింట్లోకి పరిగెత్తాను - వండిన వంట కూర, పప్పు, పులుసు వుండనే వున్నాయి. దానికి ఉడక బెట్టి వేయించిన బంగాళా దుంపలకూర యిష్టం - నాలుగు బంగళా దుంపలు కుక్కర్లో పడేసి, ఉల్లిపాయలు తరిగి వేయించేసాను. ఊరగాయలున్నాయి. ఏదన్నా స్వీటంటే.. యివన్నీ యిప్పుడు కుదరవు. ఇది ఇన్‌ఫార్మల్ లంచ్. మరోసారి భోజనానికి పిలిచి విందు భోజనం పెట్టొచ్చు. గబగబ మొహం కడుక్కుని యిస్త్రీ చీర కట్టుకుని, డ్రాయింగు రూములో పేపర్లు, పుస్తకాలు అవి సర్దుతుండగా సుడిగాలిలా రానే వచ్చి చుట్టేసింది. 'ఆంటీ... అంటుంటే దాని కళ్లల్లో నీటి పొర- తెలియకుండానే కళ్లు నిండాయి. కౌగిలించి విడివడి నా మొహం చూసి 'సారీ... వెరీసారీ... నాకు యిక్కడికి వచ్చేవరకు, మా పద్మత్త చెప్పేవరకు మీ వారి సంగతి తెలియలేదు. సడన్‌గా పోయారటగా. ఎలా వున్నారు? వంటరిగా వుండగలుగుతున్నారా... అదే అలవాటవుతుంది... ఏం చేస్తాం.. యిద్దరిలో ఎవరో ఒకరు ముందో వెనకో తప్పదు గదా - ప్రశ్న జవాబులు తనే చెప్పేస్తూ సానుభూతి మాటలు చెప్పేసింది. "ఇట్స్ ఓకే... బానే వున్నాను. అలవాటు అయిపోతుందిప్పుడిప్పుడే.. గట్టి పిండాలం మనం..." నవ్వుతూ అన్నాను.

"బాగా చెప్పారు.. అలాగే వుండాలి ఈ రోజుల్లో - ఎవరికెవరు అన్నట్టు డిటాచ్‌మెంట్‌గా వుండడం నేర్చుకోవాలి–" భుజం తట్టి చేయిపట్టుకుని సోఫాలో కూర్చోపెట్టింది. అప్పుడు చూశా శ్రావణిని - సోఫోలో కూర్చుని మా ఇద్దరి వంక ఆశ్చర్యంగా చూస్తున్న రెండేళ్ల పాపని. తెల్లగా బొద్దుగా ముద్దుగా వుంది. పొట్టి జీన్ స్కర్ట్, తెల్లటి బ్లౌజ్ వేసుకుని ప్రకటనల్లో బేబిలా వుంది. 'నీ కూతురెంత బాగుందే, నీలానే వుంది. ఎత్తుకుంటూ అన్నాను. కొత్త మొహం చూసి బిక్కమొహం పెట్టి తల్లివైపు వాలిపోతూ చేతులు చాచింది. కూతుర్ని అందుకుని 'ఇట్స్ ఓకే హనీ. ఆంటీ యీజ్ మై బెస్ట్ ఫ్రెండ్...' లాలిస్తూ వళ్లో కూర్చోపెట్టుకుంది.

ఏంటసలు, ఏమయిపోయావు యిన్నాళ్లు, ఒక్క ఫోనన్నా చెయ్యడానికి తీరిక లేదా.. నీ గురించి ఎంత బాధపడ్డానో... మీ మామయ్య భార్యని రెండు మూడు సార్లడిగా... ఆవిడ సరిగా చెప్పలేదు. మరి తెలియక చెప్పలేదో... యిష్టంలేక చెప్పలేదో... అసలు వాళ్ళు ఎప్పుడూ ఇండియాలో వుండనే వుండరు. నీ గురించి ఏ కబురు తెలియక అల్లాడిపోయాను.. ఎంత కోపం వచ్చిందో నీ మీద' కోపం బాధ ఆవేదన అన్నీ కల్సిపోయాయి నా మాటల్లో. పాపని కింద కార్పెట్ మీద కూర్చోబెట్టి క్యారీ బ్యాగులోంచి నాలుగైదు బొమ్మలు ముందు పడేసింది ఆడుకోవడానికి– "ఏం చెప్పమంటావు... గత నాలుగేళ్ళు నా జీవితంలో బ్లాకు యింకుతో రాసుకోవాల్సిన పేజీలు.. అదంతా ఓ పీడకల అనుకోవాలి - అబ్బ ఆ టెన్షన్. ఆ బాధ దినదిన గండం లాంటి బతుకు. ఆంటీ... నా లైఫ్‌లో నేను చేసిన అతిపెద్ద తప్పు పెళ్లిచేసుకోవడం - ముప్పై ఐదేళ్లకి ఆపాడు బుద్ధి పుట్టి నన్ను నేను రొంపిలోకి దింపుకున్నందుకు తిట్టుకోని క్షణం లేదు. కావాల్సిందే నాకీ శాస్తి అని నన్ను నేను శపించుకునేదాన్ని... ఏదో ఓ బలహీన క్షణంలో యీ వంటరి జీవితం కంటె ఓ తోడుంటే బాగుంటుందేమో... జీవితానికి ఓ అర్థం కనిపిస్తుందేమోనన్న పేరాశకి లొంగిపోయానే అదే నా పాలిట శాపమయిపోయి కూర్చుంది. కావాల్సిందే నా కిలా...' దాని గొంతు రుద్ధమయింది.

"పావనీ... ఛ... వూరుకో నీలాంటి ఆడపిల్లలు కళ్ల నీళ్లుపెట్టకూడదు. నీ అంత ధైర్యవంతులు అలా బేలగా మాట్లాడకూడదు. చూడీ జీవితంలో ఆటుపోట్లు ఎంతటి వారికైనా తప్పవు... అంతా సవ్యంగా, ఆనందంగా మనం అనుకున్నట్టు కోరుకున్నట్టు జరిగి పోతే అది జీవితం అవదు. ఊహించని మలుపులు కథల్లోనే కాదు జీవితాల్లోను వుంటాయి– ఎదుర్కొని, పరిష్కరించుకునే నిబ్బరం ఈ తరం అమ్మాయిలకుంది. అసలేమయింది. నీవు పెళ్లి చేసుకున్నావు అన్నదే నే విన్న ఆఖరి కబురు.. ఓ పక్క ధైర్యం చూపుతూ, ఓదార్పుగా అన్నాను.

"అవును, అదే నా సంతోషానికి ఆఖరి రోజుగా.. యింక వినడానికేముంది" నిర్వేదంగా అంది.

"ఏమిటి నీ సమస్య - చెపితే గదా ఎవరన్నా ఏదన్నా సలహా చెప్పడమో, సాయం చేయడమో చెయ్యగలరు.

"ఎవరికి చెప్పుకోవాలి. నాన్న, అమ్మా మూడేళ్ళలో ఒకరి తర్వాత ఒకరు దాటిపోయారు. అన్నయ్యలిద్దరూ ఎవరి జీవితాలు వాళ్లవి. నా గురించే పట్టించుకునే తీరిక, కోరికా లేదు.."

"ఈ ఆంటీని మర్చిపోయారా... కనీసం మాట సాయమన్నా చెయ్యలేననుకున్నావా మనసులో బాధ పంచుకోడానికన్న గుర్తురాలేదా' నిష్టూరంగా అన్నాను.

"ఆంటీ, కొన్ని విషయాలు ఎలా చెప్పాలి? ఏమని చెప్పుకోవాలో తెలియనివి - ఎదుటి వారికి చాలా చిన్నదిగా కనిపించే విషయం అనుభవించే వారికి భూతంలా భయపెడ్తుంది...

"సరేలే, ముందు లే, భోం చేద్దాం... పాపకి ఏదన్నా పెడతావా, యిప్పుడేం వద్దు, పెట్టే తీసుకువచ్చాను. అదిగో నిద్రపోయింది సోఫాలోనే"

పాపని లోపల పడుకోబెట్టి, యిద్దరం భోం చేస్తూ పక్కల మీద వాలి, లేచి టీ తాగుతూ పావని వున్న నాలుగు గంటల్లో మొత్తం నాలుగేళ్ల కథ విడత విడతలుగా చెప్పుకొచ్చింది. కాసేపు ఆకాశం, మరి కాసేపు ఆవేదన, మరికాసేపు నిస్పృహ, నిర్వేదం రకరకాల భావాలు ఆమెను ముంచెత్తాయి.

'నీ పెళ్లివరకు తెల్సు - ముప్పై ఐదేళ్ళకేనా పెళ్ళి చేసుకున్నావు. ఏదో లైఫ్‌లో సెటిల్ అయ్యావు. ఓ తోడు దొరికిందని సంతోషించాను. ఆ పెళ్లి నీకు ఆనం దాన్ని వ్వకపోగా వున్న మనశ్శాంతిని కూడా పోగొట్టుకోవడం నిజంగా బాధగా వుంది పావనీ' 'చెప్పాగా, బుద్ధి తక్కువ పనిచేసినందుకు నన్ను నేను చెప్పుతో కొట్టుకోవాలి. ఏదో అమ్మ పోయేవరకు నా పెళ్లి చింతతోనే పోయిందని, ఆవిడకి చేతిలో చెయ్యేసి మాటిచ్చానని, సరే ముప్పై ఐదేళ్లు స్వేచ్ఛగా నా యిష్టానుసారం జీవించాను. ఈ వంటరి జీవితమూ బోరుకొట్టి మార్పుకావాలనిపించి తప్పటడుగు వేశాను. హు– తప్పటడుగు అని అప్పుడు తెలియదుగదా..

"కొలీగ్ అంటావు, తెలిసిన వాడంటున్నావు - మరి అతని గురించి నీవేం గ్రహించలేకపోయావా? అతని వ్యక్తితత్వం, మైనస్ ప్లస్ పాయింట్లు గుర్తించలేకపోయావా, అతని స్వభావాన్ని ఎందుకు అర్థం చేసుకోలేకపోయావు?

"ఆంటీ పెళ్లయ్యేవరకు అంతా మంచివాళ్లే, గర్ల్ ఫ్రెండుగా వున్నన్ని రోజులు లోపాలేం కనపడవు. ఆ 'పెళ్లి' అన్న రెండక్షరాల పదంతో మొహానికి కప్పుకున్న మాస్కే తొలగి నిజరూపాలు బయటపడతాయి - భార్య అనగానే స్వంతం, ఏమనడానికైనే ఓ హక్కు అనుకుంటారు మగాళ్లు. ఇవతలి మనిషికీ ఓ వ్యక్తిత్వం, యిష్టాయిష్టాలుంటాయని గుర్తెరగరు - ఇదివరకు ఆడవారయితే మరో గతిలేక ఆర్థిక స్వాతంత్ర్యం లేక సహించే వారేమో! యిప్పుడూ అలా వుండాలంటే ఎలా ఆంటీ...

"చేసుకోక చేసుకోక పెళ్లి చేసుకున్నావు. కాస్త సర్దుకుని కాపురం నిలబెట్టుకుంటే బాగుంటుందని మా తరం వాళ్లం అంటాం - కానీ దానికి ఎంతో ఆత్మాభిమానం పణంగా పెట్టాలో, ఎంత మనసు చంపుకు బతకాలో నాకూ తెలుసు పావనీ.... కానీ యిప్పుడు పాప కూడా ఉంది. తల్లి, తండ్రి యిద్దరి మధ్య పెరగాలి పిల్లలు -

**అడవి కన్య**

పచ్చదనాల పైటజారి
రమణీయత సింగారించుకొని
వయ్యారం ఒలకబోసే / అడవికన్య ఏదీ
ఇక్కడుండాలి? / ఎక్కడని వెతకను
నా ప్రియురాలిని!!

**-జి. జి. కె. రావు**

రేపు పెద్దయి తండ్రిని దూరం చేశానని నిన్ను నిందించ కూడదు గదా.

ఏ మొగుడో ఓ మొగుడు యింట్లో మరో మనిషి తోడు నీకనవసరం. అందులో ఇప్పుడు పాప వుంది గదా. ఏదో మేర ఇగో, డబ్బు మనిషి, తన ఆధిపత్యం చెల్లాలనేతత్వం తప్ప మరీ చెడ్డవాడు కాదనీ నీ మాటల బట్టి అర్థం అవుతుంది. కొంతవరకు సర్దుకోవచ్చేమో... మరొక ఛాన్స్ అతనికిచ్చి చూడచ్చేమో... ఆలోచించు.. కొన్ని షరతులతో కాపురాన్ని నిలబెట్టుకోవవచ్చేమో...

షరతులతో, ఒప్పందాలతో కాపురాలు సాగు తాయా అంటీ. ఆలుమగలు మధ్య అండర్‌స్టాండింగ్, అన్యోన్యత లేని అదీ ఓ కాపురమేనా ఆంటీ- ఇద్దరం గిరి గీసుకుని ఒకరి నొకరు గీత దాటరాదన్న ఆంక్షలతో ఓ యింట్లో కల్సి ఎలా బతకాలి ఆంటీ ఇందుకోసమో ఇన్నేళ్లకి పెళ్లి చేసుకున్నది. అనురాగం, ఆప్యాయతలు లేని సంసారం కోపమా!-' నిష్టూరంగా అంది.

"చూడు పావనీ... దాంపత్య జీవితంలో స్త్రీ కోరు కునేది వేరు, పురుషులు కోరేది వేరు. ఎవరో అదృష్ట వంతులకి మాత్రం యిద్దరి భావాలు కలబోసుకునే అవ కాశం వుంటుంది. అలా లేనప్పుడి రెండే మార్గాలు- ఎవరి దోవ వారిది - లేదా రెండోవారి త్రోవలో పయ నించడం.

"అవును... అలా తన మనసుని దారి మళ్లించుకుని భర్త దారే వెళ్లడం ఎప్పుడూ ఆడవాళ్ల వంతే - సర్దుకో వల్సింది ఎప్పుడూ భార్యతో' నిష్టూరంగా అంది.

"అలా అక్కరలేదని యీ తరం వాళ్ళు నిరూపిస్తు న్నారుకో... కాని దాని వల్ల వాళ్లు యింకా సమస్యల్లో యిరుక్కుంటూనే వున్నారు. ఏదో ఒక కాపురం.. సర్దుకు పోవడం నయం అని వంటరి బతుకు బతకలేని వాళ్లు యీనాడు అనుకుంటూనే వున్నారనుకో.

"ఆంటీ.... ఏం చెయ్యాలో తోచక... అక్కడ నించి కాస్త ప్రశాంతత కోరుకుంటూ ఇక్కడికి వచ్చాను. ముఖ్యంగా మీరు సరి అయిన ఆలోచన, సరి అయిన నిర్ణయం సూచించగలరని మీతో మాట్లాడడానికే వచ్చాను. అమ్మా, నాన్న పోయాక యింకేం వుందిక్కడ అని రాలేదు నాలుగేళ్లయి - పాపం అన్నయ్య రమ్మన్నాడు గాని అందరితో యీ విషయం చెప్పుకోలేను. చెప్పినా సర్దుకో అన్న పాటే వినిపిస్తారు. నాకు మీ మీద నమ్మకం వుంది. మీరు చెప్పండి నేనేం చెయ్యాలో...

"అతన్ని యింట్లోంచి పొమ్మన్నానన్నావు.. ఎక్క డుంటన్నాడు... ఏం గొడవ పెట్టడం లేదు గదా"

"ఎక్కడో స్నేహితుడింట్లో వున్నాడట - బయటికి వెళ్లిం తర్వాత గాని ఆయనకి జ్ఞానోదయం అవలేదు. ఒకటే సంధి రాయబారాలు పంపిస్తున్నాడు స్నేహితుల ద్వారా - వాళ్ళంతా వచ్చి బాధపడిపోయారు. భార్యా భర్తల మధ్య గొడవలు సహజం - యీ మాత్రానికే విడి పోవడం ఏమిటి అంటూ నన్ను ఊదరగొడ్తున్నారు. నా శ్రేయోభిలాషులంటూ వచ్చి యిద్దరిని సమాధాన పరచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అదంతా ఓ పెద్ద న్యూసెన్స్‌లా అనిపించి భరించలేక కొన్నాళ్ళు మన శ్శాంతితో వుండాలని ఇండియా వచ్చాను. నన్నేం చెయ్య మంటారు. ఎలాంటి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందో మీరే చెప్పండి. ఇంకా డైవర్స్‌కి అప్లై చేయలేదు. ఇక్కడి కొచ్చి వెళ్లాక ఓ నిర్ణయం తీసుకుందా మని ఆగాను' - నా వైపు చూసింది చెప్పమన్నట్టు

"పావనీ, నీ వైపునించి నీవు అతన్ని మార్చడానికి ఎప్పుడన్నా ప్రయత్నించావా? మంచిగా చెప్పి చూశావా..? కాస్త నీవు తగ్గివుంటే అతనూ తగ్గి మారే వాడేమో... నీవు అతన్ని లెక్కచెయ్యక పోవడంతో మరింత రెచ్చిపోయాడేమో...

"ఆంటీ, రెండేళ్ళు అన్నీ సహించి భరించాను - ఏ రెండు మూడు నెలలు కాస్త తిన్నగా వున్నాడేమో.. తరువాత పొరవిడిచేసే పాములా తయారయి నిజ రూపం చూపించడం మొదలు పెట్టాడు. డబ్బుకోసం గొడవ, ఏ పనిచేసినా తప్పులెంచడం, తనమాటే నెగ్గాలి, తనన్నదే కరక్ట్ - నాకేం తెలీదు. జవాబిస్తే పొగరు, వూరుకుంటే నిర్లక్ష్యం, ఏది కొన్నా దుబారా, సంపాదిస్తు న్నానని పొగరు. ఆడదాన్నయి వుండీ వంట రాదు. మగాళ్లతే అంతలా పూసుకుతిరిగి మాట్లాడనవసరం లేదు. అందరి ఆడవాళ్లు నాలా వుండరు. మాటలో మృదుత్వం లేదు- చేతల్లో లేకితనం డబ్బు కాపీనం, జీతం అంతా తన చేతిలో పెట్టాలనే కాపీనం - వంట్లో బాగులేకపోయినా ఓ సానుభూతి మాటలేదు. అన్నింటికి మూలం- భార్య పట్ల ప్రేమ అనురాగం లోపించడం... అలాంటి భర్తతో రెండేళ్ళు కాపురం చేశాను సర్దుకుంటూ' గొంతు రుద్ధమయింది.

ఎవరిని లెక్కచెయ్యకుండా, తన స్వంత నిర్ణయాలు మంచయినా, చెడయినా తీసుకుని దాని పర్యవసానం తను భరించగలిగే మనస్థైర్యం వున్న పావనిని ఇంత బేలగా ఎప్పుడూ చూడలేదు. చదువు విషయం, అమెరికా వెళ్లడం, పెళ్లి చేసుకోననే నిర్ణయం... అన్నింటిలో ఎవరి మాట వినకుండా తనకు మంచిదని తోచింది చేసే పావని ఈనాడు యీ పెళ్లి వలన పాపం ఎంత బేల అయి పోయింది! ఇలాంటి అమ్మాయికి తనలాంటి వాళివ్వ గలిగిన సలహా ఏముంటుంది. సర్దుకు బతుకు అని చెప్పడం ఎంత వరకు న్యాయం! అలా అని పిల్లని పెట్టు కుని వంటరిగా యింకా ఎంతో వున్న జీవితాన్ని యీదగలదా! ఇన్ని ఏళ్లు వచ్చి, ఒక పిల్ల పుట్టి యీ వయసులో యింకో పెళ్లి చేసుకోడం అంత సులువా! చేసుకున్నా పిల్లని స్వంత తండ్రిలా చూసుకోగలడా! మళ్లీ యింకో వలయంలో చిక్కుకోవడం అవదా. పావని ముందు రెండే మార్గాలు పిల్లకోసం, తోడుకోసం అతనితో కాంప్రమైజ్ అవడం కొన్ని షరతులతో- లేదంటే విడిపోవడం. ఏదిచెప్పాలి తనలాంటి వారు.. తనపై యింత నమ్మకం, గౌరవం వుంచిన ఆమెకు ఏం జవాబు చెప్పాలి.

ఇద్దరి మధ్య వయసులో తల్లి కూతుర్లకుండాల్సి నంత తేడా వుంది. చిత్రంగా యిద్దరి మధ్య యింత అనుబంధం ఏర్పడడం మాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగా పావనిని ముందు చూశాను. మా పక్క అపార్టుమెంట్ కొనుక్కొని వచ్చారు ఆ కుటుంబం. కొద్ది రోజుల్లోనే మా రెండు కుటుంబాలు దగ్గరయ్యాం - వంటలు, పిండి వంటలు యిచ్చి పుచ్చు కోడాలు, కలిసి బజారుకెళ్లడం, సెలవు లొస్తే కల్సి పేకాడ డం, పిల్లలిద్దరూ ఆంటీ అంటూ చనువుగా వచ్చి పుస్తకాలు తీసుకువెళ్లడం, పావని తల్లి కూతురు మాట విననప్పుడల్లా నా దగ్గరకొచ్చి కంప్లయింట్ చేస్తే యిద్దరికి సంధి కుదర్చడం, పావనికి నచ్చచెప్పడం, పావని ఇంటర్ తరువాత ఇంజనీరింగ్ అయి అమెరికా వెడతానంటే పెళ్లి చేసుకుని వెళ్లమని తల్లి తండ్రి బలవంతం చేస్తే పావని మొండికేస్తే, అమెరికా పంపమని తల్లి నిరాహార దీక్ష, యిద్దరికి నచ్చచెప్పి పెద్దవాళ్ళు మీరూ మొండికేస్తే ఏదన్నా అఘాయిత్యం చేస్తుందేమోనని నచ్చ చెప్పి వీసాకి పంపడం - సెలవులకి వచ్చినప్పుడల్లా ఆ తల్లిదండ్రులు పెళ్లని పోరు, పావని నచ్చినవాడు దొరకలేదని ఇద్దరు వాదించుకోడం. తండ్రికి హార్ట్ అటాక్ వచ్చిపోవడం - కూతుర్ని జీవితంలో స్థిరపడమని తల్లి ఏడుపు, పావని చేత ఎలాగో ఊ అనిపించడం తల్లి పోవడం పదేళ్లుగా పావనికి నాకు మధ్య వయసు తేడా మాయ మయి స్నేహితుల్లా మాట్లాడుకుంటూ పావని ప్రతి చిన్న

## లెర్నింగ్ రోబోట్

మైడియర్ లిటిల్ ఫ్రెండ్!

అమ్మ చనుబాల తీపి మరకలు
నీ లేత పెదాలపై ఆరకముందే
మూన్నాళ్ళ బాల్యం ముద్దూ ముచ్చటా
మూడేళ్ళలో ఇంకా తీరకముందే
అమ్మ ఒడి నుండి సరాసరి
'కాన్వెంట్ బడి' అందాల పంజరంలోకి
నిర్దాక్షిణ్యంగా విసిరేసి
కల్లాకపట మెఱుగని నీ
అల్లరి జీవితానికి ఆదిలోనే
'స్కూల్ యూనిఫాం' హంసపాదు వేసి
నీ 'అణువం'త మెదళ్ళో
అర్ణవమంత విజ్ఞానాన్ని దట్టించే యత్నంలో
సుందర భవిష్యపుటూహల లౌల్యంతో
యాంత్రికార్జనా చాపల్యంలోకి
అతి త్వరగా నిన్ను నెట్టే యత్నంలో
విద్యా వ్యాపార కారాగారమనే పాఠశాలలో
నీ బంగారు బాల్యానికి నిర్దయగా
సంకెళ్ళు బిగిస్తూన్న తల్లిదండ్రులూ-
    నీ తల మోసే బరువు కన్నా
    పదింతల సిలబస్ బరువును
    బండెడు పుస్తకాల్లో కూర్చి
    నిరంతరం పుస్తకాల బరువు బస్తాను
    బాల వృద్ధునిగా-
    వంగి నడుంపై మోసే 'పిల్ల హమాలీ'గా
    నీకు ఊపిరాడకుండా చేస్తూన్న
    విద్యా వ్యవస్థా-
నీ అధ్యయన కసరత్తులో
దినాన్ని పూర్తిగా కరిగింపజేస్తూ
మిగిలిన ఏ కొద్ది సమయమైనా
ట్యూషన్లు, హోంవర్కు ఉద్వేగంలో
'భోజనం' కూడ సరిగ్గా వంటబట్టనీయకుండా
'రౌండ్ ది క్లాక్' నీ ఆనందాన్ని దోచుకుంటూ
'క్యాష్' చేసుకుంటూన్న అపూర్వ అధ్యాపనమూ
నిన్నో 'లెర్నింగ్ రోబోట్'గా తయారు చేస్తే
చూడలేకపోతున్న నా కళ్ళు
కన్నీళ్ళతో మసకబారుతున్నాయ్!!

-బొందిడి పురుషోత్తమరావు

విషయం తనకు చెప్పి సలహాలడగడం... పావని ఆఖరికి పెళ్లి చేసుకుందన్న కబురు తర్వాత... మూడు నాలుగేళ్లు ఏ కబురు లేదు. ఆఖరికి యిలా పావని రావడం యిప్పుడేం చెప్పాలి?

❖ ❖ ❖

నెల రోజుల తరువాత ఒక పెద్ద ఇ-మెయిల్ పంపింది పావని-

"మనసుని చంపుకుని, వ్యక్తిత్వాన్ని పాడె ఎక్కించేసి ఆత్మాభిమానానికి చితిపేర్చేసి, అభిమానానికి తిలోదకాలిచ్చేసి కర్మకాండ పూర్తిచేసి - ఆత్మలేని శరీరంతో రాజీకి వచ్చేసాను. శ్రేయోభిలాషులందరి సూచనలతో కాపురానికి ఓ అగ్రిమెంటు రాసుకున్నాను. రాయించుకున్నాను. షరతులతో గిరి గీసుకున్నాం. మనసులు కలవవు - మనుషులం కల్సి బతుకుతాం. ఓ కప్పు కింద కాపురం. వండుతాను, పెడతాను సగం జీతం ఆయనకివ్వాలి - ఇల్లు ఆయన నడుపు తారు - నా దారికి అడ్డురారు. ఆయన దారికి నేనడ్డు కారాదు! పాప యిద్దరిది! ఎవరెంత ప్రేమ వంతులేసుకు యిచ్చేది కాలం తేల్చాలి! పెద్దయ్యాక పాప తూచుకుని తేల్చుకుంటుందేమే!

అంటీ, ప్రతిదానికి ఓ సేచ్యురేట్ పాయింట్ వుంటుంది. ఆ స్థితికి వచ్చానిప్పుడు, నాకు ప్రశాంతత కావాలి - నాకింక దేనికోసం పోరాడి, సాధించాలన్న తపన లేదు. హాయిగా నా పాపతో ఆడుకుంటూ దాని ముద్దు ముచ్చట్లు చూసుకుంటూ ప్రశాంతంగా బతకాలని ఉంది. వాదనలొద్దు, దెబ్బలాటలు వద్దు. ఏదో ఉద్యోగం చేసుకుంటూ (ఉద్యోగము వద్దు వదలుకోవాలనే వుంది. కాని ఉద్యోగం లేకుండా ఈ మనిషి ముందు ప్రతి రూపాయికి చేయి చాపాలన్న ఆలోచన భయం అనిపించి ఉద్యోగం వదలలేను) యింత వండి పడేసి, పాపతోడే లోకంగా బతకాలన్న నిర్ణయానికి వచ్చాను. మీరంతా అన్నట్టు ఏదో ఒక మొగుడు యింట్లో మనిషి తోడు అవసరం. పాపకి ఓ తండ్రిగా అతన్ని భరించాలి అని నిర్ణయించుకున్నాను. ఈ సమాంతర రేఖలు కలవవు. కలవని రైలు పట్టాల మీద రైలు వెడుతూనే వుంటుంది. ఈ జీవితమూ అలాగే సాగిపోతుంది. ఆయనకి కావాల్సిన డబ్బు యిచ్చేసి, మిగతా సగం నాకు పాపకి - శ్రేయోభిలాషులందరికీ ఈ నిర్ణయం సంతోషానిచ్చింది. మీకూ ఆనందమేగా

-మీ పావని

ఆనందమో, బాధో... పావని పట్ల సానుభూతో, పావని లాంటి అమ్మాయి ఎంత సంఘర్షణకి లోనయి యిలాంటి నిర్ణయం తీసుకుందో నన్న ఆలోచన మనసుని కలిచివేసింది కాసేపు.

కానీ, సమాంతర రేఖలైన రైలు పట్టాలు కూడా ఒక పాయింట్‌లో కలవక తప్పదు రైలు ప్రయాణించాలంటే... కలుస్తూ, విడిపోతూ, మళ్లీ కలవడం రైలు పట్టాల నైజంలాగా కొన్నాళ్లు ప్రయాణం సాగితే మనిషిలో ఆవేశాలు, కావేశాలు ద్వేషాలు తగ్గు మొహం పట్టవచ్చు... మనసులు కల్సినా, కలవక పోయినా సర్దుబాటు అలవాటయిపోయి జీవితం ఒడిదుడుకులు లేకుండా సాగిపోవచ్చు. మనిషి ఆశాజీవి!... ఆశ మనిషిని బతికిస్తుంది. పావని జీవితంలో ఆటుపోట్లు సర్దుకుంటాయని నా నమ్మకం. ■

# దీపమాలికా వైభవం

-వై.కె. మూర్తి

దీపం ఇంటికి శుభప్రదం. లక్ష్మీరూపం. నిత్య పూజల్లో గృహాల్లోనూ, ఆలయాల్లో దైవారాధనకు దీపం ప్రాముఖ్యత వుంది.

మనదేశంలో యుగయుగాల నుంచి దీపాన్ని పూజించడం ఒక ఆచారంగా వస్తోంది. సంస్కృత సాహిత్యంలో దీపాన్ని పూజించడం గురించి ప్రస్తావనలు వున్నాయి. ఇప్పుడు కూడా మనం కార్యక్రమానికి ముందు జ్యోతి ప్రజ్వలనం చేయడం చూస్తూనే వున్నాం.

కాళిదాసు కావ్యం కుమార సంభవంలో అగ్నిదేవుని గురించి, దీప పూజను గురించి ప్రస్తావన వుంది. ప్రాచీన తమిళ సాహిత్యాన్ని పరిశీలిస్తే, పీట మీద దీపాలను అమర్చి, పూజించే విధానం గోచరిస్తుంది. ఆ రోజులలో ఉత్తర భారతంలో దీపావళి రోజున మాత్రమే దీపాలను అమర్చేవారు. కానీ దక్షిణ భారతంలో దీపావళికే గాక "కేవలం దీపాల పూజకై కార్తీక పూర్ణిమ" పర్వదినం ఏర్పడింది.

పూర్వపు రోజులలో దాదాపు అన్ని పర్వదినాల్లోనూ, సంబరాల్లోనూ దీపారాధనకు అగ్రస్థానం ఉండేది. వేదాలను బట్టి చూస్తే దేవునికి ప్రతిరూపం దీపం అన్న విషయం తెలుస్తోంది. దక్షిణ భారతంలోని దేవాలయాల్లోనే కాక, గృహాల్లోనూ ఎన్నో రకాలైన దీపాలు కనిపిస్తాయి. దేవాలయాలలో సాధారణంగా 'కుత్తు మొక్కు' అనే దీపం గోచరిస్తుంది. ఈ దీపాల అడుగు భాగం బాగా వెడల్పుగా, గుండ్రంగా వుండి లోపలి భాగం చల్లగా వుంటుంది. కొన్నిరకాల దీపాలలో ఈ భాగం 'కలువపువ్వు' ఆకారంలో వుంటుంది. దీపం మధ్య స్థూపాకార భాగాన్ని 'తొండూ' అని పిలుస్తారు. నూనె పోసే దీపపు పైభాగాన్ని 'మంగళ ఎలాక్కు' అని అంటారు. నాలుగైదు వత్తులేసి వెలిగించేందుకు వీలుగా ఒంపులుంటాయి. ఈ దీపంలో ఈ భాగాన్ని 'మంగళ విలాక్కు' అని పిలుస్తారు. ఈ భాగం నెమలి, హంస లాంటి ఆకృతులను కలిగి వుంటుంది. ముఖ్యంగా తమిళనాడులో దీపాన్ని పూజించడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజలు వందలాదిగా దీపాలను పతిష్ఠించి పూజగావిస్తారు. ఈ పూజా విధానంలో ఇలా ప్రతిష్ఠించే దీపాలను 'హట్టు ఎలొకన్' అని పిలుస్తారు. ఈ దీపాల పూజలో స్త్రీలకూ ప్రధాన పాత్ర వుంటుంది.

కేరళ రాష్ట్రం ఆది నుండి వెండి దీపపు సెమ్మెలకు ప్రఖ్యాతి గాంచింది. అలాగే తమిళనాడులోని దేవాలయాలలో ఎంతో అద్భుతమైన దీపపు సెమ్మెలు కనుల విందు చేస్తాయి. విరలేశ్వరన్ కోవెలలో అతి పెద్ద దీపపు సెమ్మె వెండిది, చూపరులను మంత్రముగ్ధులను చేస్తుంది.

ఎంతో నైపుణ్యం వున్న కళాకారుల చేతులలో ఈ దీపాలు ఎంతో కళాత్మకంగా రూపుదిద్దుకుంటాయి. దేవాలయాల్లో అమర్చే దీపాలలో చాలా భాగం ధనాధి దేవత అయిన లక్ష్మీదేవి విగ్రహం కనిపిస్తుంది. కొన్ని దీపాలకు లక్ష్మీదేవి ఆ దీపాన్ని పట్టుకొన్నట్లుగా చిత్రణ వుంటుంది. ఈ రకమైన తమిళనాడులో 'లక్ష్మీదీపం' లేక 'పావవిలాక్కు' అంటారు. దేవాలయాల్లో అమర్చే దీపాలలో 16 రకాలున్నాయి.

కొన్నిరకాల దీపాలు చెట్ల ఆకృతిలో కొమ్మల్ని విస్తరించి వుంటాయి. ఆ శాఖలలో ఎన్నో చిన్న చిన్న దీపాలుంటాయి. ఇలాంటి దీపపు సెమ్మె మీద 180 వరకు దీపాలను వెలిగించవచ్చు. ఇంకా 'అగ్నిదీపం, కూర్మదీపం, మేరుదీపం, నాగదీపం, వృషభ దీపం, హంస దీపం, మయూర దీపం.. ఇలా ఎన్నెన్నో ఆకారాలలో దీపాలు వున్నాయి. ఉత్తర భారతంలో ఒక్కొక్క దేవుని ఆరాధన కోసం ఒక్కొక్క ప్రత్యేకమైన దీపాలను ఏర్పాటు చేశారు. రామునికి మారుతి దీపం, దుర్గాదేవికి సింహ దీపం, శివునికి నంది దీపం, విష్ణువుకి నాగదీపం, లేక గరుడి దీపం... ఈ రకంగా దీపాలను ఏర్పాటు చేశారు.

అలాగే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో దీపానికి ప్రాముఖ్యత అధికంగా వుంటుంది. బెంగాల్‌లో 'గజలక్ష్మీ దీపం', ఒరిస్సాలో 'సింహ దీపం', మధ్యప్రదేశ్‌లో 'పాంచీ దీపం' చాలా ప్రాముఖ్యం వహిస్తున్నాయి.

మన రాష్ట్రంలో ఈనాటికి కొన్నిచోట్ల సాగనార చెట్టు గెలపై, ప్రమిదలను పేర్చి దీపాలను చెట్టుకు ఇంటి ముందు నిలబెడతారు. స్త్రీలకు దీపాలంకరణ పట్ల ఆసక్తి ఎక్కువ. ప్రమిదల స్థానాన్ని పలు కారణాల వల్ల నేడు, కొవ్వొత్తులు, విద్యుద్దీపాలు చోటు చేసుకున్నాయి. చైనాలో పూలు, జంతువులు వాహనాల వంటి రకరకాల ఆకృతులలో దీపాలను తయారుచేసి ఇంటి ముంగిట పెడుతుంటారు. మన దేశంలో కార్తీక మాసమంతా తులసి చెట్టు వద్ద, ఇంటి గుమ్మంలో దీపాలను వెలిగించి వుంచుతారు. రాత్రి దీపం వెలగ్గానే నమస్కరిస్తారు. అలాగే బస్సుల్లో, రైళ్ళల్లో దీపం వెలగగానే చేతులు చూసుకుని ఆ దీపలక్ష్మిని ధ్యానిస్తారు. ఇంట్లో పూజకు ముందు దీపం వెలిగిస్తారు. ఈ దీపారాధన ఎంతో పవిత్రమైంది. వైభవోపేతమైంది. ■